సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులు అందజేత

పటాన్‌చెరు టౌన్‌: సీఎం రిలీఫ్‌ఫండ్‌ పేదలకు వరం అని కాంగ్రెస్‌ నేత నీలం మధు ముదిరాజ్‌ అన్నారు. బుధవారం ఇస్నాపూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని చిట్కుల్‌లో పలువురికి రూ. 3 లక్షల 28 వేల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ... పేదలకు సీఎం సహాయనిధి ఆపత్కాలంలో అండగా నిలిచి ఆదుకుంటుందన్నారు.

కాంగ్రెస్‌ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా రాందాస్‌గౌడ్‌



ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్‌కాలనీ డివిజన్‌కు చెందిన పి. రాందాస్‌గౌడ్‌ కాంగ్రెస్‌ పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. తనపై నమ్మకంతో అవకాశం కల్పించినందుకు కాంగ్రెస్‌ అధిష్టానానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా రాందాస్‌గౌడ్‌ మాట్లాడుతూ కాంగ్రెస్‌ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్‌ నాగేందర్‌యాదవ్‌

శేరిలింగంపల్లి: స్వయం సహాయక సంఘాల మహిళలు ప్రభుత్వం అందించే రుణాలతో ఆర్థికంగా బలోపేతం కావాలని కార్పొరేటర్‌ రాగం నాగేందర్‌యాదవ్‌ తెలిపారు. బుధవారం శేరిలింగంపల్లి వార్డు కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేందర్‌ యాదవ్‌ మాట్లాడుతూ వడ్డీలేని రుణాల చెక్కులను త్వరలోనే నియోజకవర్గ స్థాయి సమావేశంలో పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఆఫీసర్‌ నాగ మల్లేశ్వరి, సీఓ శ్రీకాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

గుడిసెలు తొలగిస్తున్నారంటూ..

బసవతారకనగర్‌లో ఆందోళన



బసవతారక నగర్‌వాసులతో మాట్లాడుతున్న ఏడీసీపీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

గచ్చిబౌలి: గోపన్‌పల్లిలోని బసవతారకనగర్‌లో గుడిసెలు తొలగిస్తున్నారంటూ గుడిసెవాసులు ఆందోళనకు దిగారు. బుధవారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి గుడిసెలు తొలగిస్తూ దాడులకు పాల్పడ్డారంటూ ప్రధాన రహదారిపై బైఠాయించారు. గుడిసెలు తొలగించిన ఐదుగురు వ్యక్తులను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. మాదాపూర్‌ ఏడీసీపీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్‌ హబీబుల్లాఖాన్‌ ఘటనా స్థలానికి చేరుకుని దాడికి పాల్పడిన వారిపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని చెప్పడంతో ఆందోళన విరమించారు. తమను నిరాశ్రయులను చేస్తున్నారని గుడిసెవాసులు గచ్చిబౌలి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై ఉన్నతాధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

రోడ్డు పనులు పూర్తి చేయండి



శాంతినగర్‌ కాలనీలో రోడ్డును తవ్వి వదిలేసిన దృశ్యం

మియాపూర్‌: అభివృద్ధి పనుల కోసం రోడ్డును తవ్వి వదిలేయడంతో స్థానిక ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. చందానగర్‌ డివిజన్‌ పరిధిలోని శాంతినగర్‌ కాలనీ ప్రధాన రహదారిలో రోడ్డు నిర్మాణ పనుల కోసం తవ్వి వదిలేశారు. తవ్విన చోట ఎలాంటి సూచికబోర్డు ఏర్పాటు చేయలేదు. రోజుల తరబడి వదిలేయడంతో అటువైపు వెళ్లే వాహనదారులు అవస్థపడుతున్నారు. అసలే వర్షాకాలం.. వరదనీటిలో గుంతలు కనిపించక వాహనదారులు ప్రమాదాల బారినపడే అవకాశముంది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డు పనులు త్వరగా చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.





అటు మట్టి.. ఇటు బురద

- పైప్‌లైన్‌ వేశారు.. మట్టిని తొలగించడం మరిచారు
- చిన్నపాటి వర్షానికి రోడ్డంతా రొచ్చురొచ్చు
- నత్తనడకన పనులతో స్థానికుల అవస్థలు

చందానగర్‌: హైదరాబాద్‌–ముంబయి జాతీయ రహదారి విస్తరణలో భాగంగా సర్వీస్‌ రోడ్డులో భారీ పైప్‌లైన్‌ పనులు మొదలయ్యాయి. అయితే పైప్‌లైన్‌ కోసం తవ్విన మట్టిని రోడ్డు పక్కనే వేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షానికే సర్వీస్‌ రోడ్డు అంతా బురదగా మారింది. ముఖ్యంగా చందానగర్‌లోని బీఎస్‌ఎన్‌ఎల్‌ కార్యాలయం, ప్రైవేటు బ్యాంకుల ముందు కనీసం నడవడానికి కూడా వీలు లేకుండా పోయింది. కార్యాలయంలోకి వెళ్లడానికి ఉద్యోగుల అవస్థలు వర్ణనాతీతం. నెలల తరబడి రోడ్డు విస్తరణ జరగడంపై వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పనుల్లో ఆలస్యంపై స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా త్వరితగతిన పైప్‌లైన్‌ పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.

ఇవీ చేయాల్సింది :

- సర్వీస్‌ రోడ్డుపై పైప్‌లైన్‌ పనుల కోసం తవ్విన మట్టిని మరోచోటకు తరలించాలి
- వర్షాలు కురవకముందే పైప్‌లైన్‌ పనులు పూర్తి చేయాలి
- త్వరితగతిన సర్వీస్‌ రోడ్డులో తాగునీటి పైప్‌లైన్‌ వేయాలి
- జాతీయ రహదారిపై ట్రాఫిక్‌ సమస్య దృష్ట్యా సర్వీస్‌ రోడ్డును అందుబాటులోకి తీసుకురావాలి
- దుకాణాల ముందు అసంపూర్తిగా ఉన్న మురుగు నీటి కాలువ పనులు వెంటనే ప్రారంభించాలి
- ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మట్టిని ఒక వైపు వేయించాలి
- వర్షాకాలం గుంతలు తవ్వకుండా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

దుకాణాల ముందే పెద్ద మట్టి కుప్పలు



సర్వీస్‌ రోడ్డులో పైప్‌లైన్‌ కోసం తీసిన మట్టిని రోడ్డుపైనే వేయడంతో మా షాపునకు అడ్డంగా ఉంది. దుకాణానికి వచ్చే వారు లేరు. త్వరతగతిన పనులు పూర్తి చేసి మట్టిని తరలించాలి.

– శ్రీనివాస్‌, చందానగర్‌

కార్యాలయానికి వెళ్లాలంటే భయమేస్తుంది



పైప్‌లైన్‌ కోసం తీసిన మట్టిని రోడ్డుపైనే వేయడంతో అవస్థ పడుతున్నాం. బ్యాంకుకు, బీఎస్‌ఎన్‌ఎల్‌ కార్యాలయంలోకి వెళ్లాలంటే మట్టి కుప్పల మీద నుంచి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. చిన్నపాటి వర్షానికి మట్టి కరిగి రోడ్డంతా బురదగా మారింది.

– రామకృష్ణ గౌడ్‌, చందానగర్‌



చందానగర్‌ జాతీయ రహదారి పక్కన మట్టి కుప్పలు



జాతీయ రహదారి సర్వీస్‌ రోడ్డులో పైప్‌లైన్‌ గుంతలోకి ఒరిగిన వాహనం



చందానగర్‌ జాతీయ రహదారిపై చిన్నపాటి వర్షానికి బురదమయంగా మారిన రోడ్డు

దేవాలయాల వద్ద వసతులు కల్పించాలి



చందానగర్‌ ఉపకమిషనర్‌ మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

చందానగర్‌: బోనాల సందర్భంగా హఫీజ్‌పేట్‌ డివిజన్‌ పరిధిలోని గ్రామ దేవాలయాల వద్ద కనీస వసతులు ఏర్పాటు చేయాలని ఉపకమిషనర్‌ మోహన్‌రెడ్డికి బీజేపీ డివిజన్‌ అధ్యక్షులు జితేందర్‌ బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం బోనాల పండగలో అరకొర వసతులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. శాంతినగర్‌, హుడా కాలనీ, గంగారం, మదీనాగూడ, హఫీజ్‌పేట్‌ గ్రామం, ఆల్విన్‌ కాలనీ, ప్రజయ్‌ సిటి, సాయినగర్‌లోని అమ్మవార్ల దేవాలయాల వద్ద లైటింగ్‌, రోడ్డు మరమ్మతులు, మంచినీరు ఏర్పాటు చేయాలని విన్నవించారు.

నాణ్యత పాటించాలి..

మంజీరా పైప్‌లైన్‌ నూతన రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించాలని డీసీ మోహన్‌రెడ్డికి బీజేపీ నాయకులు విన్నవించారు. మైహోమ్‌ జువెల్‌ నుంచి సరస్వతీ విద్యామందిర్‌ వరకు చేపట్టిన రోడ్డును త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి అజిత్‌ సేనాపతి, మాజీ కౌన్సిలర్‌ రమణయ్య, డివిజన్‌ ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, నాయకులు నర్సింహ యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో సమస్య పరిష్కారం



జిన్నారం (పటాన్‌చెరు): ప్రభుత్వ కళాశాలలో చదివే విద్యార్థులకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి బస్సు సౌకర్యం కల్పించారు. జిన్నారం మండలంలోని ఊట్ల, దాదిగూడెం, రామ్‌నగర్‌ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో చదువుతున్నారు. కాగా ప్రతిరోజు ఆయా గ్రామాల నుండి కళాశాలకు వచ్చేందుకు రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని మాజీ జెడ్పీ వైస్‌ చైర్మన్‌ ప్రభాకర్‌ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన న్యూలాండ్‌ పరిశ్రమ యాజమాన్యంతో చర్చించి బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. సమస్య రిష్కరించిన ఎమ్మెల్యేకు విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి అన్నారు. బుధవారం భారతీనగర్‌ డివిజన్‌ పరిధిలోని ఇక్రిశాట్‌ ఫెన్సింగ్‌ ఏరియా, ఎల్‌ఐజీ, మ్యాక్‌ సొసైటీ కాలనీలో రూ.కోటి 26లక్షల నిధులతో చేపట్టిన ప్రహరీగోడ, భూగర్భడ్రైనేజీ పనులు, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీ పరిధిలోని పటాన్‌చెరు, రామచంద్రాపురం, భారతీనగర్‌ డివిజన్‌ పరిధిలోని కాలనీలలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టినట్టు వివరించారు. వర్షాకాలం ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ వి.సింధురెడ్డి, ఉపకమిషనర్‌ సురేష్‌, నాయకులు పరమేష్‌, ఐలేష్‌ యాదవ్‌, పృథ్వీరాజ్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఆదివారం పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

మియాపూర్‌ : ఆర్టీసీ మియాపూర్‌–2 డిపో పరిధిలో ప్రతి ఆదివారం పుణ్యక్షేత్రాలకు బస్సు నడుపుతున్నట్లు మేనేజర్‌ వెంకటేశం ఓ ప్రకటనలో తెలిపారు. గూడంగుట్ట సత్యనారాయణస్వామి దేవాలయం, ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం, కొండగట్టు హనుమాన్‌ దేవాలయం, వేములవాడ రాజరాజేశ్వరి ఆలయాల దర్శనాలకు ప్రతి ఆదివారం బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ఉదయం 5 గంటలకు మియాపూర్‌ నుండి బయల్దేరి అదేరోజు రాత్రి 11 గంటలకు తిరిగి మియాపూర్‌కు చేరుకుంటుందని తెలిపారు. ఒక్కో వ్యక్తికి రూ.1200 చార్జీ ఉంటుందని తెలిపారు. అదే విధంగా కర్ణాటక గంగాపూర్‌ దత్తాత్రేయ స్వామి దర్శనానికి ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం 9059162162,9959226420 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో .. టమాట 40, పచ్చిమిర్చి 70 , బెండ 60, కాకర 60, దొండ 60, దోస 40, ఆలు 30, చామ 50, కీర 40, బీర 50, వంకాయ 40, గోకర 60, బీన్స్‌ 120, బీట్‌రూట్‌ 40, క్యాప్సికమ్‌ 80, క్యాబేజీ 25, క్యారెట్‌ 60, చిక్కుడు 100, ఉల్లి 30(కేజీ), ములక్కాయలు (1) 10 , సొరకాయ (కేజీ) 20, అల్లం 70, వెల్లుల్లి 150.

గురుకుల పాఠశాలలో 12న స్పాట్‌ అడ్మిషన్స్‌

జిన్నారం (పటాన్‌చెరు): జిన్నారం మండలం కేంద్రంలోని గురుకుల పాఠశాలలో ఎంపీసీ, బైపీసీ మొదటి సంవత్సరం మిగిలిన సీట్ల భర్తీకి ఈనెల12న స్పాట్‌ అడ్మిషన్‌లను స్వీకరించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్‌ వెంకటనారాయణ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు ఒరిజినల్‌ సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటల వరకు రావాలని సూచించారు.

ఏబీవీపీ వ్యవస్థాపక దినోత్సవం

రాయదుర్గం: అఖిల భారత విద్యార్థి పరిషత్‌ 77వ వ్యవస్థాపక దినోత్సవంను బుధవారం హెచ్‌సీయూలో ఘనంగా నిర్వహించారు. ఏబీవీపీ హెచ్‌సీయూ అధ్యక్షుడు అనిల్‌కుమార్‌, కార్యదర్శి ఆయుష్‌కుమార్‌సింగ్‌ ఆధ్వర్యంలో బుధవారం ఏబీవీపీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం క్యాంపస్‌లో మొక్కలు నాటారు.

ఘనంగా సీతారాముల కల్యాణం



మణికొండ: అలకాపూర్‌ టౌన్‌ షిప్‌లోని శ్రీ సీతారామచంద్రస్వామి, అభయాంజనేయస్వామి ద్వితీయ వార్షికోత్సవ పూజలలో భాగంగా బుధవారం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు సుప్రభాతసేవ, సాత్తుమొర్రై, శాంతి పాఠం, వేద విన్నపాలు, కుంభారాధన, నిత్యాహవనం, శ్రీ సుదర్శన హవనం, నిత్యపూర్ణాహుతి పూజలను నిర్వహించారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణ, సాయంత్రం శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, బలిహరణ, హారతి నిర్వహించారు. కల్యాణోత్సవానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆలయ కమిటీ చైర్మన్‌ నాగరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

వైద్యరంగంలో ఏఐ, రోబోటిక్స్‌ కీలకం

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

గచ్చిబౌలి: ఆరోగ్య సంరక్షణలో ఏఐ ఆధారిత రోబోటిక్‌ సాంకేతికతను జోడించడం హర్షణీయమని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. భారతదేశంలోనే అత్యంత అధునాతన ఏఐ ఆధారిత రోబోటిక్‌ సర్జరీ సిస్టమ్‌ను హైటెక్‌ సిటీలోని కేర్‌ ఆస్పత్రిలో బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకి మెరుగైన చికిత్స, వైద్యరంగంలో ఉన్నత ప్రమాణాలను స్థాపించడంలో కేర్‌ ఆస్పత్రి కృషిని అభినందిస్తున్నానన్నారు. క్వాలిటీ కేర్‌ ఇండియా లిమిటెడ్‌ గ్రూప్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌ వరుణ్‌ మాట్లాడుతూ వైద్య రంగంలో ఆర్టిఫిషియల్‌ ఇంటెలిజెన్స్‌, రోబోటిక్స్‌ కీలకంగా మారుతున్నాయన్నారు. ఖచ్చితమైన వైద్యం, శస్త్ర చికిత్స విధానాల్లో మార్పులు వేగంగా వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో కేర్‌ ఆస్పత్రి ఆర్థోపెడిక్స్‌ క్లినికల్‌ డైరెక్టర్‌, సీనియర్‌ కన్సల్టెంట్‌ డాక్టర్‌ గొట్టిముక్కల అశోక్‌రాజు, డాక్టర్లు వాసుదేవ జువ్వాడి, జగన్‌మోహన్‌రెడ్డి, శరత్‌బాబు, ఇతర వైద్యబృందం, ఆస్పత్రి అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పొదుపు అలవాటు చేసుకోవాలి

మోతీనగర్‌: నేటి పొదుపు భావితరాలకు మేలు చేస్తుందని జీహెచ్‌ఎంసీ మూసాపేట సర్కిల్‌ ప్రాజెక్టు ఆఫీసర్‌ ఇంద్రసేన అన్నారు. బుధవారం సర్కిల్‌ పరిధిలోని మూసాపేట డివిజన్‌ మోతీనగర్‌ వార్డు కార్యాలయంలో ఇందిరా మహిళా శక్తి వేడుకల్లో భాగంగా మహిళా సమైఖ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నూతన మహిళా సంఘాలు ఏర్పాటు చేయటం, వడ్డీ లేని రుణాలు, ఇందిరా మహిళా శక్తి వ్యక్తిగత రుణాల మంజూరు గురించి క్లుప్తంగా వివరించారు. అదే విధంగా వర్షాకాలంలో సీజనల్‌ వ్యాధులైన మలేరియా, డెంగీ వంటి విషజ్వరాలు రాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

నాలుగు లేబర్‌ కోడ్‌లను రద్దు చేయాలి



చందానగర్‌ సర్కిల్‌ 21 కార్యాలయం వద్ద కార్మికుల ర్యాలీ

చందానగర్‌ : కార్మిక చట్టాలు 42ను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు కోడ్‌లను తెచ్చి కార్మిక హక్కులను హరిస్తున్నారని వివిధ కార్మిక సంఘాల నాయకులు పేర్కొన్నారు. బుధవారం చందానగర్‌ జీహెచ్‌ఎంసీ సర్కిల్‌ 21 కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ లింగంపల్లి చౌరస్తా వరకు సాగింది. ర్యాలీలో ఐఎన్‌టీయూసి, ఏఐటీయూసి, సీఐటీయూసీ, ఎంఐటీయూసీ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్‌ కోడ్లను తీసుకువచ్చి 8 గంటల పని విధానాన్ని రద్దుచేసి 12 గంటల పని విధానాన్ని అమలు చేసి కార్మికులను అణిచివేసే ప్రయత్నం చేస్తుందని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా కార్మికుల పొట్టకొడుతున్నారని విమర్శించారు. ఈ ర్యాలీలో ఎస్‌ఎఫ్‌ఐ యూనియన్‌ అధ్యక్షులు అజారుద్దీన్‌, కార్మిక నాయకులు శోభన్‌, కొంగరి కృష్ణ, చందు యాదవ్‌, రాములు, మురళీ, కొమ్ము పరమేశ్‌ల ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ, అంగన్‌వాడీల కార్మికులు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సీఐటీయూ బైక్‌ ర్యాలీ

జిన్నారం (పటాన్‌చెరు): సీఐటీయు ఆధ్వర్యంలో చేపట్టిన దేశవ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం జిన్నారం క్లస్టర్‌ పరిధిలోని పారిశ్రామికవాడల్లో నాయకులు బైక్‌ ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల శ్రమను దోపిడీ చేసేందుకు నాలుగు లేబర్‌ కోడ్‌లను ప్రవేశపెట్టనుందని వాటికి వ్యతిరేకంగా బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ సభ్యుడు శ్రీధర్‌రావు మాట్లాడుతూ.. కార్మికులకు కనీస వేతనం 26 వేలు చెల్లించాలని పదిగంటల పని విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్‌ చేశారు. న్యూలాండ్‌ పరిశ్రమ ప్రధాన కార్యదర్శి వెంకటేషగౌడ్‌, రవి, హుస్సేన్‌, గోపాల్‌రెడ్డి, కృష్ణయ్య, కార్మికులు పాల్గొన్నారు.

నేటి నుంచి చాతుర్మాస దీక్ష ప్రారంభం

చందానగర్‌ : చందానగర్‌ వేంకటేశ్వరస్వామి ఆలయ సముదాయంలో 10వ తేదీ గురువారం (గురుపౌర్ణమి) సందర్భంగా చాతుర్మాస దీక్ష ప్రారంభం కానుందని ఆలయ అధ్యక్షులు రఘుపతిరెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీక్ష భగవదనుగ్రహానికి, ఆత్మ శుద్ధికి, ఆధ్యాత్మిక చింతనకు ఉన్నత మార్గం అని అన్నారు. భాగ్యనగరంలో ఆధ్యాత్మిక ప్రవచనాలు, ధార్మిక సభలు, సామూహిక విష్ణు సహస్ర, లలితా సహస్ర నామ పారాయణం, భగవద్గీత పారాయణం జరుగుతాయన్నారు.

పూజల వివరాలు...

ఆషాఢశుద్ధ పౌర్ణమి జూలై 10వ తేదీ ఉదయం 8.00 గంటలకు తీర్థ స్నానం, గోపూజ, గణపతి హోమం, 9.30 గంటలకు కృష్ణాది నవ పంచకారాధన, 11.00 గంటలకు గురుపాదుకా పూజ, భిక్షా వందనం, శ్రీ చరణుల అనుగ్రహ భాషణం, ప్రసాద గోష్ఠి, సాయంత్రం 6.30 గంటలకు శ్రీ శారదా స్వరూప రాజశ్యామల చంద్రమౌళీశ్వరారాధన తీర్థ గోష్ఠి ఉంటాయన్నారు. నాలుగు నెలల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు.

సీసీ రోడ్డు పనులు పరిశీలన



హెచ్‌ఏఎల్‌ కాలనీలో సీసీరోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

రాయదుర్గం: హెచ్‌ఏఎల్‌ కాలనీలో రూ.4 కోట్లతో సీసీరోడ్ల నిర్మాణం చేస్తున్నామని ఎమ్మెల్యే గాంధీ స్పష్టం చేశారు. శేరిలింగంపల్లి డివిజన్‌లోని హెచ్‌ఏఎల్‌ కాలనీలో సీసీరోడ్ల పనులను ఇంజనీరింగ్‌ అధికారులతో కలిసి ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ హెచ్‌ఏఎల్‌ కాలనీతోపాటు కెఎంఆర్‌ ఎస్టేట్‌, పారామౌంట్‌ కాలనీలతో పాటు చుట్టుపక్కల కాలనీవాసులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. నాణ్యతతో పనులు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్‌ అధికారులు డీఈ ఆనంద్‌, ఏఈ భాస్కర్‌, నాయకులు శ్రీనివాస్‌యాదవ్‌, దాత్రిగౌడ్‌, హరికృష్ణ పాల్గొన్నారు.

ప్రధాన రోడ్డు.. గుంతలమయం





శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లిలోని ఆలిండ్‌ పరిశ్రమ ఎదురుగా ఉన్న ఓల్డ్‌ ముంబాయి జాతీయ రహదారి గుంతలు పడింది. దీంతో వాహనదారులు ఇబ్బందులుపడుతున్నారు. ముఖ్యంగా సాయంత్రం వేళల్లో గచ్చిబౌలి నుంచి భెల్‌ చౌరస్తా వైపు వెళ్ళే వాహనదారులతో ఈ రోడ్డు రద్దీగా ఉంటుంది. గుంతలు పడ్డ ప్రాంతంలో ఒక్కసారిగా వాహనాల వేగం తగ్గి మెల్లగా పోతుండడంతో ట్రాఫిక్‌ స్తంభించిపోతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు రక్తదాన శిబిరం

ఆల్విన్‌కాలనీ: మేరా యువభారత్‌ ఆధ్వర్యంలో 10వ తేదీ గురువారం ఉదయం 9.30 గంటలకు రక్తదాన శిబిరాన్ని ఆల్విన్‌కాలనీ డివిజన్‌, భూదేవి హిల్స్‌ కాలనీలో ఏర్పాటు చేసినట్లు బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్‌ యాదవ్‌ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. భారతీయ జన సంఘ్‌ వ్యవస్థాపకుడు, స్వర్గీయ శ్యామాప్రసాద్‌ ముఖర్జీ జయంతి కార్యక్రమంలో భాగగా శిబిరంను ఏర్పాటు చేశామన్నారు. యువకులు రక్తదాన కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.